



సమావేశంలో మాట్లాడుతున్న బ్రూక్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే

ధర్మవరం-గుత్తి రైల్వే పనులు పూర్తి

◆90 కిలోమీటర్లు డబుల్ లైన్ కనెక్టివిటీతో విద్యుదీకరణ ◆చిగిచెర్ల-ధర్మవరం మధ్య 11 కిలోమీటర్ల మేర పనులు



గుత్తి-ధర్మవరం ప్రాంతంలో పనులు పూర్తయిన డబుల్ రైల్వే లైన్



ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి జిల్లాలో రైల్వే శాఖ మరో ముఖ్యమైన ప్రాజెక్టును పూర్తి చేసింది. చిగిచెర్ల నుంచి ధర్మవరం మధ్య డబ్లింగ్, విద్యుదీకరణతో సహా పూర్తి చేసి, దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. దీని ఫలితంగా గుత్తి నుంచి ధర్మవరం వరకు మొత్తం 90 కిలోమీటర్ల మేర ఇప్పుడు డబుల్ రైల్వే లైన్ కనెక్టివిటీ విద్యుద్దీకరణతో అందుబాటులోకి వచ్చింది.

గుత్తి - ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖమైన రైలు మార్గం. ఈ లైన్ రెండు తెలుగు రాష్ట్రాలను బెంగుళూరు, కర్ణాటక రాజధాని నగరం వెలుపల కలిపే ముఖ్యమైన మార్గాలలో ఒకటిగా పనిచేస్తుంది. రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ జెడ్ సర్వీస్ (రైట్స్) ద్వారా 90 కిలోమీటర్ల మేర గుత్తి - ధర్మవరం ప్రాజెక్టు డబ్లింగ్, విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూ. 636.38 కోట్లను రైల్వే శాఖ మంజూరు చేసింది. గుత్తి - ధర్మవరం మధ్య 90 కిలోమీటర్ల మేర పనులు దశలవారీగా చేపట్టారు. మొదటగా కల్లూరు-గార్లదిన్నె మధ్య 13 కిలోమీటర్ల దూరం డబ్లింగ్, విద్యుదీకరణ పనులు సెప్టెంబర్ 2019లో పూర్తయ్యాయి. దీని తర్వాత చిగిచెర్ల, జంగాలపల్లి మధ్య 11 కిలోమీటర్లు జూన్ 2020లో, గార్లదిన్నె-తాటిచెర్ల మధ్య 9 కిలోమీటర్లు నవంబర్, 2020లో మొదలయ్యాయి. 2021 అక్టోబర్‌లో కల్లూరు - గుత్తి మధ్య 27కి.మీలు, ఆగస్ట్ 2022లో తాటిచెర్ల - జంగాలపల్లి మధ్య 19 కి.మీల పనులు ప్రారంభం అయ్యాయి. చివరి భాగంలో 11 కిమీల దూరం వరకు మొత్తం పనులు పూర్తి అయ్యాయి. ఈ పనుల పూర్తితో రైళ్ల రాకపోకలు సాగించేలా మొత్తం ప్రాజెక్ట్ ప్రారంభం అయ్యింది.

ఈ రైల్వేలైన్ అందుబాటులోకి రావడం వల్ల రైళ్ల రాకపోకలకు రద్దీని తగ్గిస్తుంది. బెంగళూరు, ఆ తర్వాతి స్టేషన్లకు ఎక్కువ సంఖ్యలో ప్యాసింజర్ సరుకు రవాణా చేసే రైళ్లను నడపడానికి వీలు కల్పిస్తుంది. ఇది సెక్షన్‌లోని రైళ్ల సగటు వేగాన్ని పెంచడంలో కూడా సహాయపడుతుంది. మెరుగైన రైలు కనెక్టివిటీతో ఈ ప్రాంతం సామాజిక-ఆర్థిక అభివద్ధికి కూడా సహాయపడుతుంది. ధర్మవరం-బెంగళూరు మధ్య నైరుతి రైల్వే పరిధిలోని డబుల్‌లైన్ పనులు కూడా వీటితోపాటు ప్రారంభం అయ్యాయి. ఈ కీలక ప్రాజెక్టును ప్రారంభించడంలో చురుగ్గా పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ సంస్థ, రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) బందం, గుంతకల్ డివిజన్ అధికారులు, సిబ్బంది బందాన్ని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. ఈ ముఖ్యమైన విభాగాన్ని డబ్లింగ్ చేయడం వల్ల రైలు రాకపోకల కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని ఈ విభాగంలో ప్యాసింజర్‌చ సరుకు రవాణా రైళ్ల రాకపోకలను సులభతరం చేస్తుందని జనరల్ మేనేజర్ పేర్కొన్నారు.

గాడిదల సంఖ్య పడిపోతోంది..!

◆పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
◆బ్రూక్ సీనియర్ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో గాడిదల సంఖ్య గణనీయంగా పడిపోతుండటం ఆందోళన కలిగించే అంశమని బ్రూక్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే తెలిపారు. దేశంలో గాడిదల సంఖ్య తగ్గిపోతుండటంపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ ప్రియా పాండే ముఖ్య ఉపన్యాసం చేశారు. గణనీయంగా తగ్గిపోతున్న జాతుల్లో గాడిదలున్నాయని చెప్పారు. గాడిద మాంసలో ఔషద గుణాలున్నాయంటూ ఉన్న ప్రచారంతో పెద్దఎత్తున మాంసం ఎగుమతులు, దేశం నుంచి బయటకు జరుగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మరింత అధికంగా గాడిదల మాంస విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిపై పరిశీలించిన తరువాత గాడిద వధ శాలలపై చర్యలు తీసుకోవాలన్న ఒత్తిడిని పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఈ అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి అవసరముందన్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనూ గాడిదల సంఖ్యలో తగ్గుదల ఏటా కనిపిస్తోందన్నారు. ఇలాగే జరుగుతోపోతే కొంతకాలానికి గాడిదల సంఖ్య తగ్గిపోయే ప్రమాదమూ లేకపోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గాడిదలను వధించడానికి వీల్లేదన్న చట్టముందని గుర్తు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొన్ని చోట్ల వీటి వధ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ రకంగా జాతులు అంతరించే స్థాయి వెళ్లడం అన్నది ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తుందన్నారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు నాగభూషణం మాట్లాడుతూ ఒక్కప్పుడు గాడిదల ద్వారా బరువైన వస్తువుల రవాణా జరిగేదన్నారు. బట్టలు, కట్టెలు, మట్టి వంటివి మోయడానికి వినియోగించే వారమని చెప్పారు. ఇప్పుడు వాహనాలు అందుబాటులోకి వచ్చాక వాటి వినియోగం, అవసరం లేకుండాపోయిందన్నారు. దీంతో ఇవి కనుమరుగవుతున్నట్టు చెప్పారు. ఇటీవలి కాలంలో గాడిద పాలు మంచిదన్న ఆలోచనతో అక్కడకక్క వాటిపాలు అమ్ముకునేందుకు మాత్రమే ఉంటున్నాయన్నారు. వెంకటేశ్ అనే వ్యక్తి మాట్లాడుతూ పాలకు పెరుగుతున్న డిమాండ్‌ను చూసి వడ్డిపల్లి వద్ద గాడిదల ఫామ్‌ను తాము ఏర్పాటు చేసామని తెలిపారు. ఇప్పుడు మార్కెటింగ్‌కు అవకాశం పెద్దగా లేకుండా ఉందని చెప్పారు. ప్రభుత్వం వైపు నుంచి సహకారం అవసరమన్నారు. ఈ పామ్ గురించి అక్కడికి వచ్చిన అధికారులు, తోటి వారు ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కర్నూలు జిల్లా అధికారి రామచంద్రయ్య, అనంతపురం జిల్లా అధికారి సుబ్రమణ్యం, జిల్లా పరిషత్ సిఇఒ భాస్కర్‌రెడ్డి, బ్రూక్స్ ప్రతినిధులు డాక్టర్ సరిత నేగి, గౌరిశా భరద్వాజ్, రజక వృత్తిదారుల సంఘం నాయకులు నారాయణస్వామి, కసాపురం ఆంజినేయులు, పశు సంవర్ధక శాఖ ఎడి రామచంద్రారెడ్డి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు తీవ్రతరం చేద్దామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జగదీష్, సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహా పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కల్లూరు సుబ్బారావు ఉద్యానవనంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు తీసుకొచ్చిన పేస్ యాప్‌తోపాటు ఏళ్ల తరబడి సమస్యగా ఉన్న ఇపిఎఫ్, ఇఎస్ఐ 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికుల సమస్యలు, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తదితర సమస్యలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. ముఖ ఆధారిత హాజరును రద్దు చేయాలని ఇప్పటికీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేశామన్నారు. ఇందులో భాగంగా చలో అసెంబ్లీ కార్యక్రమానికి యూనియన్ పిలుపు ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.నరసింహమూర్తి, నాయకులు ఆనంద, మంజునాథ్, నాగేంద్ర, నారాయణ, చంద్ర, శోభమ్మ, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ధర్మవరం టిక్కెట్టు నాదే.. గెలిచి తీరుతా..
నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్



కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజలు అభివృద్ధి చెందాలన్నా.. రాష్ట్రాభివృద్ధి సాధించాలన్నా టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంతోపాటు సంజీవపురం, మూష్టూరు, మాల్యవంతం, అప్పరాచెరువు గ్రామాల్లో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రపై టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం, నాయకులు కల్పిస్తున్న అడ్డంకులను ఎదురొడ్డి యువనేత చేపట్టిన యువగళం పాదయాత్ర వచ్చే నెలలో జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు తెలిపారు. కావున పాదయాత్ర విజయవంతం అయ్యేలా యువకులు చూడాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు పాదయాత్రలో పాల్గొనేలా చూడాలన్నారు. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించి రాబోయే శాసనసభ ఎన్నికలకు పులివెందుల నుంచే నాంది పలకాలని పిలుపునిచ్చారు.

కష్ట సమయంలో ధర్మవరం బాధ్యతలు

ధర్మవరంలో ఉన్న నాయకుడు పార్టీని వదిలేసిపోతే కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు అధినేత చంద్రబాబు పిలిచి తనకు బాధ్యతలు అప్పజెప్పారని, అప్పటి నుంచి అనుక్షణం కష్టపడుతూనే ఉన్నానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అభ్యర్థులు కూడా నిలబడలేని పరిస్థితి ఉన్న సమయంలో చంద్రబాబు నాకు బాధ్యతలు అప్పజెప్పారన్నారు. అధికార పార్టీ నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మీరు మాత్రం పార్టీ వీడకపోవడం గర్వంగా ఉందన్నారు. అప్పటికే రాప్తాడులో పని చేస్తున్న తనపై ధర్మవరం బాధ్యతను ఎంతో నమ్మకంతో అప్పజెప్పారన్నారు. అందుకే తాను స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలనైంత వరకు అభ్యర్థులను బరిలో నిలిపి పార్టీని నిలబెట్టామన్నారు. ధర్మవరంలో ఒకరితో కాకుండా ఇద్దరు రాక్షసులతో పోరాడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, టిడిపి కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతలయ్య, సురేంద్ర నాయుడు, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, నెట్టెం రమణ, చల్లా శ్రీనివాసులునాయుడు, అయ్యప్ప, శ్రీనివాసులు, సుధీర్, నెట్టెం అశోక్, బోయపాటి గోపాల్, రవీంద్ర, సుబ్బరాయుడు, గంటాపురంజగ్గు, ప్రవీణ్, రాము, జక్కంపూటి నాగభూషణ, గజ్జిరామయ్య, జొన్నలగడ్డ రంగానాయుడు, కేశవరెడ్డి, గురుప్రసాద్, వడ్డేబొజ్జప్ప, పాముల పెద్దన్న, సూర్యనారాయణ, నాగరాజు, మోహన, అప్పస్వామి, సదాశివ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మండలి ఎన్నికలకు కేంద్రాలు ఏర్పాటు

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల మండల ఎన్నికల కోసం జిల్లాలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ రూమ్‌ని స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి సంబంధించి పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ రూమ్‌ని స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటు చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నియోజకవర్గానికి సంబంధించి పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రిసెప్షన్ కేంద్రాన్ని, పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ రూమ్‌ని స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటు చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

మరింత వేగవంతంగా భూ సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో రీసర్వే పనులను మరింత వేగవంతం చేసి ఆయా గ్రామాల్లో ఏప్రిల్ 15 నాటికి గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, రీసర్వే, మ్యూటేషన్స్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొదట విడత కింద 26 గ్రామాల్లో, రెండవ విడత కింద 29 గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. ఈ గ్రామాల్లో ఏప్రిల్ 15 నాటికి గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధిగమించి రీ సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఐఒఎస్‌లు కపాకర్, శాంతరాజ్, డిఐఒలు నరేంద్ర, శామ్యూల్, చంద్రశేఖర్, చిట్టిబాబు, అంజలీదేవి, మోహన్, మురళీ, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బిసి కుటుంబంపై దాడి అమానుషం

బాధితులకు అండగా 'కందికుంట' ధర్నా



పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

తలుపుల మండలం కుర్లి గ్రామానికి చెందిన బిసి కుటుంబానికి చెందిన హరికుమార్, ఐశ్వర్య కుటుంబంపై వైసిపి నేత కుర్లి శివారెడ్డి దాడి చేయడం అమానుషమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుండ వెంకటప్రసాద్ అన్నారు. అర్ధరాత్రి హరికుమార్ ఇంటిపై దాడి చేయడంతోపాటు నిండు గర్భిణీ, వృద్ధురాలిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ కందికుంట ఆధ్వర్యంలో కదిరి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గూండాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శంకర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ వైసిపికి చెందిన సర్పంచు అర్ధరాత్రి సమయంలో దాడికి పాల్పడడమే కాకుండా పశువులను, ట్రాక్టర్‌ను లాక్కొని ఊరు వదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయాలని బెదిరించడం విడ్డూరమన్నారు. దీంతో భయపడిన కుటుంబంలోని గర్భిణీ బిక్కుబిక్కుమంటూ కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిందన్నారు. ఈ ఘటన చూస్తుంటే రాచరిక, అనాగరిక కాలంలో ఉన్నామా... ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. ప్రశ్నించారు. సిఎం సొంత నియోజకవర్గం పులివెందులకు 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న కుర్లి గ్రామంలోనే ఇలా జరుగుతోందంటే పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వెంటనే గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పికెట్ ఏర్పాటు చేయడంతోపాటు బీసీ కులానికి చెందిన వారిని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సారథులే పార్టీ వారధులు


నకిలీ ఓట్ల ఏరివేతపై చొరవ తీసుకోవాలి : మాజీమంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-రామగిరి

త్వరలో నియమించనున్న కుటుంబ సాధికార సారథులే పార్టీ వారధులు అని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం మండలంలోని పేరూరులో ఉన్న తన స్వగృహంలో పార్టీ కీలక నాయకులు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు కుటుంబ సాధికార సారధులను నియమిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం గట్టిగా పనిచేసే వారిని సారథులుగా నియమించాలని సూచించారు. ఇందులో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బూత్ కన్వీనర్లు, స్థానిక నాయకులు హౌస్ మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆధార్ కార్డు, ఓటర్ కార్డుతో అనుసంధానం పూర్తి చేయడం గురించి దృష్టి సారించాలన్నారు. ఇది వాలంటీర్ల ద్వారా చేస్తే ఒప్పుకోవద్దన్నారు. మరోవైపు పోలింగ్ బూత్‌ల పరిధిలో కొత్త ఓటర్లను చేర్పించడం, కొన్ని కుటుంబాల్లో నమోదుకాని ఓట్లను గుర్తించి నమోదు చేయించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులంతా విబేధాలు, చిన్న చిన్న ఇబ్బందులు పక్కన పెట్టి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు చేస్తున్న దౌర్జన్యాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు ఇవ్వని అంశాన్ని గ్రామాల్లో వివరించాలని సూచించారు. మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి పంచాయతీలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో ఓటు వేయించాలన్నారు. రాంగోపాల్‌రెడ్డి పులివెందులలో పార్టీ కోసం ఎంతో చేశారని, అలాంటి వ్యక్తిని గెలిపించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.

కుల కలకలంపై ఎపిఆర్‌జెసిలో విచారణ

ప్రజాశక్తి-పరిగి



కళాశాలలో విచారణ చేస్తున్న అధికారులు

మండలంలోని ఎపి ఆర్‌జెసి పాఠశాలలో ఇటీవలే దళిత విద్యార్థిపై ఓ ఉపాధ్యాయురాలు కులం పేరుతో దూషించిన ఘటనపై సౌజన్య లక్ష్మి, ఎస్ఐ నరేంద్ర, ఎంఇఒ లక్ష్మీదేవి గురువారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ దళిత విద్యార్థులపై ఉపాధ్యాయురాలు సుజాత చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనని, ఇక్కడ సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శివారెడ్డి అండతోనే చేసినట్లు తేలిందన్నారు. ఒక వంట మనిషి ఫిర్యాదులో సంతకం పెట్టడం ఏంటనే ప్రశ్నించడమే కాకుండా అక్కడ పనిచేస్తున్న కొంతమంది జీతభత్యాలను బిల్లులను సైతం కాకుండా చూస్తానని శివారెడ్డి ఫోన్ సంభాషణలో హెచ్చరించారని ఇతనిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ఇలాంటి ఘటనలో పురావృతం కాకుండా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

రోడ్డును కప్పేసిన ఇసుక

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-రొద్దం



ఇసుకలో ఇబ్బందులు పడుతున్న వాహనదారుడు

పెన్నానదిలో నీటి ప్రవాహం నిలిచినా రోడ్డు సమస్య మాత్రం తీరలేదు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది పొంగి ప్రవహించిన విషయం తెలిసిందే. దాదాపు కొన్ని నెలల కొర్దీ పెన్నా ప్రవాహం తగ్గకపోవడంతో మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్నానది ప్రవాహం నిలిచి పోయి నెలలు గడిచినా దాదాపు 3 నుంచి 5 అడుగుల వరకు ఇసుక రావడంతో పాత రోడు పూర్తిగా పూడిపోయింది. దీంతో వాహనదారులు నానాతిప్పలు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని నరనాగిపల్లి, కుర్లపల్లి, చిన్నకోడిపల్లి, నల్లూరు, దండేపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా రొద్దం నరణాగేపల్లి సచివాలయం నుంచి మండల కేంద్రానికి రావాలంటే కిలోమీటరు మేర చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. ఆఖరికి సచివాలయ సిబ్బంది సైతం విధులకు రావాలన్నా తీవ్ర అంతరాయం నెలకొంటోందని స్థానికులు అంటున్నారు. కావున కనీసం రోడ్డు వేయకపోయినా కొద్దిపాటి ఇసుకను తొలగిస్తే సమస్య తీరుతుందని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా నామినేషన్లు

పట్టభద్రులకు 33, ఉపాధ్యాయ స్థానానికి 12 దాఖలు

ప్రజాశక్తి-అనంతపురం

మండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. కడప, అనంతపురం, కర్నూల్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సబంధించి గురువారం నాడు పట్టభద్రుల నియోజక వర్గంలో 33 నామినేషన్లు, ఉపాధ్యాయుల నియోజక వర్గంలో 12 నామినేషన్లు, స్థానిక సంస్థల నియోజకవర్గంలో 2 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.


మాట్లాడుతున్న ఈడిగ సంఘం నాయకులు

ఈడిగలు అన్నిరంగాల్లో రాణించాలి

పెనుకొండ : ఈడిగ కులస్తుల అన్నిరంగాల్లో రాణించాలని పలువురు ఈడిగ కుల పెద్దలు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఘనగిరి ఈడిగ సంక్షేమ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడిగ కులస్తులు ఐక్యమత్యంతో ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ కుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆయా రాజకీయ పార్టీల్లో ఉన్న వారు కులాన్ని అభివృద్ధి చేసేందుకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడిగ కులపెద్దలు, మాజీ జెడ్పిటిసి చిన్నప్పయ్య, గిరిధర్ గౌడ్, నీళ్ల రమణ, వెంకటరమణ, పద్మ, ప్రకాష్‌గౌడ్, గోపీగౌడ్, మారుతీగౌడ్, శ్రీరాములు, అశ్వర్థప్ప, హరి, అశోక్, పార్థసారథి, సత్తి మంజు, నాగరాజు, యల్లప్ప, సాయి, అంజనగౌడ్, రామచంద్ర, ఈడిగ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

లేపాక్షి : మండలం పరిధిలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అజయ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. లేపాక్షి మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పెయింటర్ శివప్ప, నాగమణి కుమారుడు అజయ్‌కుమార్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మూడు నెలలుగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందగా దాదాపు రూ.2 లక్షల వరకూ ఖర్చు అయింది. తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పోగు చేసి బాధితుడి తండ్రి శివప్పకు గురువారం రూ.54,780 మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా మారుతీరెడ్డి



రొద్దం : జిల్లా సాంస్కృతిక జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పెద్దగువులపల్లి మారుతీరెడ్డిని ఎంపిక చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం జగన్, రాయలసీమ కో ఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ ఆశీస్సులతో తనకు పదవి వచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలపారు.

ఉగాది పండుగకు జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు


బత్తలపల్లి : కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లేఅవుట్లలో నూతనంగా నిర్మించిన గృహాల్లో ఉగాది పండుగ రోజు ప్రవేశాలు కల్పించనున్నట్లు మండల హౌసింగ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో సాగుతున్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు లబ్ధిదారులు కూడా సిద్ధం చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారి ఇంటి పట్టాలను రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. కావున లబ్ధిదారులు అందరూ సహకరించాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మడకశిర రూరల్ : ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపిడిఒ సోనియాబాయి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మనూరు కళ్లుమెరి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలు అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసిపి యువజన అధ్యక్షుడిగా వాల్మీకి లోకేష్

హిందూపురం : వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వాల్మీకి లోకేష్‌ను నియమిస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనతోపాటు వాణిజ్య విభాగం అధ్యక్షులుగా శ్రీకాంత్‌గౌడ్‌ను నియమించారు. ఈమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ మొహమ్మద్ ఇక్బాల్‌ను సందర్భంగా గురువారం ఆయన నివాసంలో వారు కలిశారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత కోసం పార్టీ చేస్తున్న కార్యక్రమాలను వివరించి, 2024 ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో పార్టీ జెండా రెపరెపలాడే విధంగా పని చేయాలన్నారు.


ఇక్బాల్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న వైసిపి యువజన విభాగం జిల్లా నాయకులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి..

సిపిఎం మండల కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీ పైభాగంలో ఉన్న తిరువంగల చెరువుకు సంబంధించిన సర్వే నంబర్ 362లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి రమేష్ కోరారు. గురువారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్‌కి సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన చండానాయక్ స్థలాన్ని ఆక్రమించుకుని నగర పంచాయతీ అనుమతులు లేకుండానే బోరు వేసి, నీళ్ల ట్యాంకర్లతో నీటిని అమ్ముతున్నాడన్నారు. దీంతోపాటు ఇటుక బట్టీలు వేసుకుని నగర పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ చెరువు సంబంధించిన రాతి కట్టడాలను కొద్దికొద్దిగా తొలగిస్తున్నారన్నారు. చెరువు కట్ట తెగి ఏదైనా ప్రమాదం జరిగితే శ్రీరాములయ్య కాలనీలో ఉన్న కుటుంబాలన్నీ రోడ్డున పడే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు మండల నాయకులు వజ్రం నాగప్ప, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలి

రాష్ట్ర ఎంటోమొలజిస్టు కొండారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని రాష్ట్ర ఎంటోమొలజిస్ట్ కొండారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాయామం, మాతాశిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు, రక్తహీనతపై పర్యవేక్షణలో భాగంగా స్థానిక సిబ్బందితో సమీక్షించారు. ఇందులో భాగంగా పిహెచ్‌సిలో గర్భిణులకు చేస్తున్న రక్తపరీక్షలు, గ్రామంలో నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే పాటించి జ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. అలాగే వ్యాయామం చేయడం వల్ల శారీరక ఉల్లాసం, మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నాగరాజునాయక్, జ్యోష్ణ, సిహెచ్ఒ నగేష్, టిఎన్ఎన్ లలితకుమారి, సబ్ యూనిట్ ఆఫీసర్ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణ, చంద్రకళ, నాగరత్నమ్మ ఎల్‌టి కేశవ, ఎంఎల్‌హెచ్‌పిలు, రాధా, విజయ్, సుస్మిత, సత్యమ్మ, లక్ష్మి నారాయణమ్మ, ఎఎన్ఎంలు ప్రమీల, సుస్మిత, మంజువాణి, రాధమ్మ, నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి-హిందూపురం

మండలం వ్యాప్తంగా ప్రతి గ్రామాన్నీ అభివృద్ధికి చేసేందుకు వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉన్నామని ఎంపిపి రత్నమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపిటిసిలు పలు సమస్యలను వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలు, విద్యుత్ సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. అధికారులు మండలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నివేదికల రూపంలో వివరించారు. గోలాపురం సర్పంచి, తూమకుంట ఎంపిటిసి షమీమ్, తాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నప్పటికీ పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిర్లక్ష్యాన్ని విడిచి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపిపి రత్నమ్మ, ఎంపీడీఒ నరేంద్ర మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి, రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. మహిళల సంక్షేమానికి, మహిళాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలన్నారు. ఇంకా ఏవరైనా అర్హులు ఉంటే పథకాల కోసం నేరుగా వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ నాగభూషనం, వైస్ ఎంపిపిలు రఘునాథ్‌రెడ్డి, రామాంజి, స్పెషలాఫీసర్ సురేష్, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రత్నమ్మ

వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుని ఎంపికపై హర్షం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తిరుపాల్‌నాయక్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైసిపి అనుబంధ విభాగాల నూతన జిల్లా అధ్యక్షులుగా ముగ్గురిని ఎంపిక చేయగా వీరిలో ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తిరుపాల్‌నాయక్, బీసీ సెల్ అధ్యక్షునిగా రమణ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా సోమశేఖర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్ మాట్లాడుతూ వైసిపి పెట్టిన నాటి నుంచి నేటి వరకు పార్టీ అభ్యర్థి కోసం కృషి చేసినందుకు తనను గుర్తించి పదవి ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన సిఎం జగన్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపాల్‌నాయక్ ఎంపిక పట్ల ప్రముఖ పారిశ్రామికవేత్త పెడపల్లి ఎర్ర భాస్కర్‌నాయక్, హైదరాబాద్ సునీత, శంకర్‌లాల్ నాయక్, గోరంట్ల జడ్పిటిసి జయరాంనాయక్, సర్పంచి నాగేనాయక్, పెడపల్లి సర్పంచి మంగ్లీబాయ్, ఎంపిటిసి సరస్వతీబాయ్, పెడపల్లి తండా పెద్ద బాపూజీనాయక్, వైసిపి నాయకులు శ్రీనివాస్‌నాయక్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డీలర్ల వద్ద దిగుమతి ఛార్జీలు తీసుకోవద్దు..

ప్రజాశక్తి-గాండ్లపెంట

చౌకధాన్యపు డీలర్లు వద్ద దిగుమతి ఛార్జీలు తీసుకోవద్దని డీలర్ల సంఘం అధ్యక్షుడు శివరంగ వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.రవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీలర్ల అధ్యక్షుడు మాట్లాడుతూ ఆహార భద్రతా చట్టం సవరించి 2019 మార్చి 8న పౌరసరఫరాల కమిషన్ సర్కులర్ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ఈ సర్కులర్‌ను అమలు చేయాలని రాష్ట్ర సంఘంతోపాటు రాష్ట్ర చౌకధరల దుకాణందారులు సంక్షేమ సంఘం 483/8. ప్రకారం హైకోర్టును ఆచరించగా డీలర్లు వద్ద నుంచి దిగుమతి ఛార్జీలు వసూలు చేయవద్దని పిటిషన్ విచారణలో ఈనెల 16న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. అలాగే మార్చి నుంచి ఉచితంగా సరుకులు దిగుమతి చేయాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ ఇక నుంచి హమాలీ ఛార్జీలను తీసుకోకూడదని హమాలీలకు తెలియజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు సి.సంజీవరెడ్డి, బాబు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎండలు పెరిగేలోపు పనులు పూర్తి చేసుకోండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలు ఎండలు పెరిగేలోపు పనులు పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలని ఎపిఒ కుందనం ఆదెప్ప సూచించారు. గురువారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో చేప్టిన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు కూలీల వేతనాలు జమ చేసినట్లు తెలిపారు. రోజుకు రూ.257 వేతనం వచ్చేలా పనులు చేయాలని సూచించారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న కారణంగా ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉదయం ఆరు గంటలకే పనికి వచ్చి 11 గంటలలోపు పని చేసుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు ఉన్నారు.


అప్పరాచెరువులో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఎపిఒ అదెప్ప

దాదులూరు ఉత్సవాల్లో పాల్గొన్న పరిటాల సునీత

ప్రజాశక్తి-కనగానపల్లి


మండల పరిధిలోని దాదులూరి పోతలయ్య ఉత్సవాల సందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీత సభ్యులతో కలిసి గురువారం బంగారు పోతలయ్య, చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీతకు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఆలయ పూజారులు, టిడిపి మండల కన్వనర్ యాతం పోతలయ్య ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ సతీమణి జ్ఞాన, టిడిపి సీనియర్ నాయకులు ఎల్.నారాయణచౌదరి, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టిడిపి శ్రేణులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీమంత్రి పరిటాల సునీల

ఆర్డీటీ సెక్యూరిటీ గార్డు వీరప్పకు సన్మానం

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న చెడిపోతుల వీరప్పనుకర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన చెడిపోతుల వీరప్ప ఆర్డీటీ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ ఐదేళ్లుగా రక్తదానం చేస్తున్నాడు. దీనికితోడు రక్తదానానికి పలువురుని ప్రోత్సహిస్తున్నాడు. ఈనేపథ్యంలో కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ వారు తమ సంస్థ మూడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కర్నూలుకు వీరప్పను ఆహ్వానించి దుశ్శాలువా కప్పి డైరెక్టర్లు శ్రీకాంత్, మక్బూల్ సన్మానించి, ప్రశంసాపత్రం, మెమోంటోను అందజేశారు.


చెడిపోతుల వీరప్పను సన్మానిస్తున్న సొసైటీ డైరెక్టర్లు శ్రీకాంత్, మక్బూల్

ఘనంగా సిద్ధేశ్వరుని బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి-అమరాపురం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి రథోత్సవం గురువారం భక్తుల కోలాహలం మధ్య సాగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విగ్రహానికి తెల్లవారుజామున విశేష పూజలు, కుంకుమార్చన, నైవేద్య, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రంగు రంగుల పూలతో అలంకారం చేసి కలశస్థాపన చేసిన అనంతరం ఉత్సవమూర్తిని ఆలయం నుంచి బాజాభజంత్రీల నడుమ రథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు రథంపైకి బొరుగులు, అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు బందోబస్తు చేపట్టారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ద్వారా అలీంకో వారి ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వీల్‌ఛైర్స్, ఒకరు లెటర్ వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు నరసింహుడు, వినయ్, సిజివి.కాసింబి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రామగిరి

మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు చేయి విరిగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న టిడిపి కార్యకర్త గొల్ల బోమయ్యకు గురువారం మండల తెలుగు యువత ఆధ్వర్యంలో పావగడ హెల్ప్ సొసైటీ అధ్యక్షులు మానం శశికిరణ్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండలతెలుగు యువత అధ్యక్షులు ఎల్.శ్రీధర్‌నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డి.పోతన్న, ఓబుళపతి, స్థానిక నాయకులు బొమ్మయ్య, రవిచంద్ర, రామాంజినరెడ్డి, రమేష్, డిపి.బాబు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నగర పంచాయతీలోని వడ్రపాళ్యం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో గురువారం వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వడ్డే శివప్ప, గిరిజమ్మ, నాగరత్నమ్మ, రాజప్ప, భాగ్యమ్మ, గోవిందమ్మ, శాంతమ్మతోపాటు అనుచరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ పార్వతమ్మ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

'యువగళం'లో గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఇందులో భాగంగా లోకేష్ బస చేసే విడిది వాహనంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితిపై ఆరాతీసినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానాలు దక్కుతాయన్న సంకేతాలు కూడా అందాయని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెగార్లపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


యువగళం పాదయాత్రలో నడుస్తున్న గుండుమల తిప్పేస్వామి

నేరాలు ఘోరాలు

'పురం'లో యాచకురాలిపై అత్యాచారయత్నం

హిందూపురం : పట్టణంలోని ప్రధాన కూడలి రహమత్‌పురం సర్కిల్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వికలాంగ యాచకరాలపై గుర్తు తెలియని దుండగుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ప్రతిఘటించడంతో తీవ్రంగా తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోరంట్లకు చెందిన బాధితురాలు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా హిందూపురంలో యాచక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈనేపథ్యంలో రహమత్‌పూర్ సర్కిల్లో ఉన్న ఓ షెల్టర్ వద్ద మరో ఐదుగురు యాచకలతో కలిసి రాత్రి నిద్రిస్తోంది. ఆ సమయంలో ఓ దుండగుడు తాగిన మైకంలో అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో ప్రతిఘటించింది. దీంతో దుండగుడు తలకు తీవ్రంగా కొట్టి పరారయ్యాడు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బాధితురాలిని తెల్లవారుజామున గమనించిన చుట్టుపక్కల వారు ఆమెకు ధైర్యం చెప్పి 108 వాహనంలో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొలంలోనే కుప్పకూలిన రైతన్న


మృతిచెందిన కాటమయ్య

బత్తలపల్లి : పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుప్పకూలి రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పోట్లమర్రి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పోట్లమర్రికి చెందిన చెడిపోతుల కాటమయ్య (60) తనకున్న మూడెకరాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్నాడు. దీనికితోడు పొలం పక్కనే ఉన్న మరో రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని ఆకుకూర సాగు చేసుకున్నాడు. ఇందులో భాగంగా పొలంలో పని చేస్తూ మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఉన్నఫంగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు పరీక్షించేలోపు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య చెన్నమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చిన్నారి ఆరోగ్యం కోసం ఆర్థికసాయం

హిందూపురం : పెనుగొండ పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద కోడిగుడ్లు ఉడుకు పెట్టే వేడి నీటిలో పడి తీవ్రంగా గాయపడిన చిన్నారి వెన్నెలకు అల్ ఇందాద్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బాసటగా నిలిచారు. ఇందులో భాగంగా చిన్నారి వైద్యసేవల కోసం గురువారం తండ్రికి రూ.25వేలు ఆర్థికసాయం అందించి త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అల్ ఇందాద్ ఛారిటబుల్ ట్రస్టు ఎండిఎస్ అమన్, జెమినీ నవీన్, ట్రస్టు కార్యదర్శి ఉమర్ ఫరూక్, జాయింట్ కార్యదర్శి ఉస్మాన్, బ్లడ్ ప్రెసిడెంటు సాదిక్, మెంబర్లు వివేక్, ఆయాజ్, అర్షద్, ధనుష్, మన్న, హరీష్, సత్తి, కృష్ణ, అభి, లోకి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

ప్రమాద బాధితుడికి పరామర్శ


గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని మరూకుంటపల్లి గ్రామానికి చెందిన రామన్న రామ్మోహన్‌ను ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని సూచించారు. అంతకుముందు వైసిపి నాయకుడు రామిరెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాయత్రి, వైసిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, రామచంద్ర, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

రొద్దం : మండలంలోని కోగిర ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బోయ తిమ్మయ్య, సర్పంచి రామకృష్ణ, చిలకల రవి, స్వామి, ఎస్సీ సెల్.గంగాధర్, ఎంఆర్‌పి ఎస్.రామాంజనేయులు, చిన్న కంబాలప్ప, శేషు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆలయానికి విరాళం

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని ఉగ్గిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న శ్రీరాములు ఆలయానికి టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర రూ.10,116, బోయపల్లి శివారెడ్డి రూ.10,116 మొత్తాన్ని గురువారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమంతురెడ్డి, ఉగ్గిరెడ్డిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత..


వైఎస్‌ఆర్ ప్రమాద బీమా అందిస్తున్న ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి

బుక్కపట్నం : గతంలో మృతిచెందిన మండల పరిధిలోని మారాల గ్రామానికి చెందిన పాత్రికేయుడు ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు వైఎస్‌ఆర్ బీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబంలో ప్రమాదవశాస్తూ మరణించిన వ్యక్తికి వైఎస్‌ఆర్ ప్రమాద బీమా పథకం ద్వారా కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారాల సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలు పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను ఎన్నికల సెక్టార్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ రవినాయక్, ఎస్ఐ సద్గురుడు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా వసతులపై సిబ్బందితో ఆరాతీశారు. వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.